క్లుప్తంగా

సూచిక బోర్డులు తప్పనిసరి



ప్రమాద స్థలాలను పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసులు, తదితరులు

కలకడ : జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు అత్యంత ప్రమాదకర మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సీఐ శ్రీనివాసులు సూచించారు. బుధవారం చిత్తూరు–కర్నూలు 40వ నంబర్ జాతీయర రహదారిపై కలకడ, కె.వి.పల్లె, కలికిరి, పీలేరు మార్గమధ్యంలో అత్యంత ప్రమాదకర మలుపులు ఉన్న ప్రదేశాలను గుర్తించి సమీక్షించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో పీలేరు మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ విజయకుమారి, ఎస్ఐ రామక్రిష్ణారెడ్డి, జాతీయరహదారి కడప ఏఈఈ రఘు, చిత్తూరు ఏఈఈ ప్రసన్నయాదవ్ పాల్గొన్నారు.

ఐటీబీపీ బెటాలియన్ కేంద్రంలో వైద్యశిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

కలికిరి : కలికిరి సమీపంలోని ఐటీబీపీ 53వ బెటాలియన్ కేంద్రంలో హిమ్‌వీర్ వైఫ్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ అమిత్ భాటి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో ఐటీబీపీ జవాన్‌లు, అధికారుల భార్యలు (హిమ్‌వీర్ వైఫ్స్)కు మహిళా వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ఏలాంటి నిర్లక్ష్యం వహించకూడదని వైద్యాధికారులు సూచించారు.

ఎన్నికల విధులపై ఈ నెల 30న శిక్షణ

పీలేరు : సాధారణ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల ప్రక్రియలో పాల్గొననున్న అధికారులకు ఈనెల 30న మొదటి విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహబూబ్‌బాషా అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 30న ఉదయం 10 గంటలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఒక్క రోజు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి నేడు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులతో సమావేశం ఉంటుందని చెప్పారు.

అనాథాశ్రమ విద్యార్థులకు అన్నదానం



భోజనం అందజేస్తున్న పూర్ణిమ

మదనపల్లె సిటీ : ఓ ఫంక్షన్‌లో మిగిలిపోయిన భోజనాన్ని స్థానిక చైతన్య అనాథశ్రమ విద్యార్థులకు బుధవారం మహాకార్య ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు పూర్ణిమ అందజేశారు. ఫంక్షన్లు, వివాహాలు, ఇతర కార్యక్రమాల్లో మిగిలిన ఆహారాన్ని అందజేస్తే వాటిని అనాథశ్రమాలకు, వీధుల్లోని అనాథలకు అందజేస్తామన్నారు. ఆమెను చైతన్య అనాథాశ్రమ నిర్వాహకురాలు కవితరాణి అభినందించారు.

చునావ్ పాఠశాలపై అవగాహన సదస్సు

వాల్మీకిపురం : చునావ్ పాఠశాల అనేది ఓటర్‌కి అవగాహన కోసం నియమించడం జరిగిందని తహసీల్దార్ ఖాతిజున్ కుబ్రా అన్నారు. బుధవారం మండలంలోని చింతపర్తి ఎంపిపి పాఠశాలలో చునావ్ పాఠశాల ఎన్నికల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 65 నుంచి 70 శాతం ఓట్లు పోలింగ్ అవుతుందో అలాంటి చోట చునావ్ పాఠశాల ప్రోగ్రాం పెట్టి ఓటు శాతం పెంచేందుకు ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది ఒక ఆయుధం లాంటిదన్నారు. ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటలక్ష్మి, సెక్టార్ ఆఫీసర్స్ రామచంద్ర, మిథున్ చక్రవర్తి, రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీముక్కంటేశ్వరుడి రథోత్సవం

రామసముద్రం : మండలంలోని ఊలపాడు పంచాయతీ నరసాపురం గ్రామంలో వెలసిన శ్రీ ముక్కంటేశ్వరస్వామి తిరునాలలో భాగంగా మంగళవారం రాత్రి వైభవంగా రథోత్సవం నిర్వహించారు. ఈ రథోత్సవానికి ఆంధ్రా, కర్ణాటక నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. భక్తులకు గ్రామస్తులు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి మదనపల్లె వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహమ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డిలు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. వారికి గ్రామస్తులు మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు.

పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా చర్యలు

- ఏప్రిల్ 14వరకు ఓటు నమోదుకు గడువు
- 18 ఏళ్లు నిండిన ఓటరు వద్దకే బీఎల్వోలు
- నమోదు చేయడమే కాదు.. ఓటువేయించడం చేయాలి
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ హరిప్రసాద్



మాట్లాడుతున్న ఆర్వో హరిప్రసాద్

మదనపల్లె : ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు చాలా విలువైనది. ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోవడంతో పాటు పోలింగ్‌శాతం పెంచేలా అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోందని, దీనికి నియోజకవర్గంలోని ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ హరిప్రసాద్ కోరారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో ఓటరు నమోదు, స్వీప్ అవగాహన కార్యక్రమాలపై పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆర్వో హరిప్రసాద్ మాట్లాడుతూ..సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో చైతన్య కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఓటుహక్కు వినియోగంపై అవగాహన పెంచేందుకు కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈఏడాది ఏప్రిల్ 1వ తేదీకి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారు ఓటరుగా నమోదుచేసుకుని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకోవచ్చన్నారు. ఏప్రిల్ 14 వరకు ఓటు నమోదుకు ఎన్నికల కమిషన్ గడువు ఇచ్చిందని తెలిపారు. ఇప్పటివరకు అర్హత కలిగి ఉండి, ఓటరుగా నమోదుచేసుకోని విద్యార్థులు, యువతీ,యువకులను గుర్తించి, ఫారం–6లు ఇచ్చి ఓటరుగా నమోదయ్యేలా చూడాలన్నారు. దీనికోసం కళాశాలల్లో ప్రత్యేకంగా ఒకరికి బాధ్యతలు అప్పగించాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థుల వివరాలను సేకరించి, తమకు సమాచారం అందిస్తే.. సంబంధిత బీఎల్వోలను కాలేజీ వద్దకే పంపి ఓటునమోదుచేయిస్తామన్నారు. ఓటు నమోదు ఆన్‌లైన్‌లోనూ చేసుకోవచ్చని, ఓటర్ ఐడీని ఉచితంగా ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఫోన్లలో ఓటర్ హెల్ప్ లైన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే, తమ ఓట్లకు, పోలింగ్‌స్టేషన్లకు సంబంధించిన సమస్త సమాచారం అందులో ఉంటుందన్నారు. ఓటింగ్ శాతం పెంపే లక్ష్యంగా... పోలింగ్ కేంద్రాల్లో పురుషులకు, స్త్రీలకు వేర్వేరుగా క్యూలైన్లు, సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేక వసతులు ఏర్పాటుచేస్తున్నామన్నారు. మహిళా ఓటర్లు అధికంగా ఉన్నచోట ప్రత్యేక పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, తహసీల్దార్ రమాదేవి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, ఎంఈఓలు ప్రభాకరరెడ్డి, రాజగోపాల్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాతకు పట్టం కట్టండి



ఎన్నికల ప్రచారం చేస్తున్న పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి

కేవీపల్లె : అభివృద్ధి ప్రదాత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టాలని పీలేరు, కేవీపల్లె మండలాల వైఎస్సార్‌సీపీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఎంవీపల్లె పంచాయతీలోని గుండ్రేవారిపల్లె క్రాస్, పెద్దహరిజనవాడ, వై.కె.పల్లె, కాలనీ, కుంటిమేకలపల్లె, కాశీబీడుహరిజనవాడ, రాచపల్లెవారిపల్లె, చెరువుకిందహరిజనవాడ, గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి ఆర్థిక లబ్ధి చేకూరిందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం పలు గ్రామాలకు రోడ్డు సౌకార్యం, మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ పాలన ఇంటివద్దకే వచ్చినట్లు చెప్పారు. నిరంతరం ప్రజాసేవకు అంకితమైన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, సర్పంచ్ రత్నాకర్‌రెడ్డి, ఎంపీటీసీ ఈశ్వరయ్య, రెడ్డెప్పరెడ్డి, వినీష్‌రెడ్డి, ధర్మారెడ్డి, పొత్తపు సతీష్‌రెడ్డి, గంగిరెడ్డి, డాబా బాబు, విజయరెడ్డి, ధనుంజయరెడ్డి, గోవర్ధన్, రఫీ, మల్లికార్జున, రమేష్‌రెడ్డి, సైపుల్లాఖాన్ పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించండి



వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చింతల

- టీడీపీ నుంచి 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక
- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : సంక్షేమ సారథి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం కలకడ మండలం బాలయ్యగారిపల్లి పంచాయతీ బాయకాని వడ్డిపల్లికి చెందిన టిడిపి నాయకులు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో లక్ష్మయ్య, శ్రీరాములు, సుధాకర, రామ్మోహన, ప్రభాకర, రాజశేఖర్, బాలాజీ, మల్లికార్జున, రెడ్డిశేఖర్, నాగార్జున, రెడ్డి మోహన, బావేంద్ర, పల్లపు ఆంజనేయులు, మురళి, సిద్దన్న, శంకర, రమణ, వెంకటేశ్వర్లు, నాగరాజ, అన్నయ్య, రెడ్డెప్ప, వెంకటేష్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ గ్రామ స్వరాజ్య స్థాపన కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కలకడ మండల పార్టీ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, ఎంపిపి శ్రీదేవి, సింగల్ విండో అధ్యక్షులు బాబు రెడ్డి, జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులు యల్లయ్య, నాయకులు దేవరపల్లి బాబు, ప్రకాష్ రెడ్డి, కుమార్‌రెడ్డి, రెడ్డెప్ప, అన్నయ్య, వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతో సంక్షేమ పాలన

కలికిరి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో సంక్షేమ పాలన సాధ్యమని, ఇప్పుడున్న సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మెన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్ అన్నారు. మండల కేంద్రమైన కలికిరి ఇందిరమ్మకాలనిలో వీరు బుధవారం ఇంటిటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమ లబ్ధిని గుర్తించి ఓటర్లకు వివరించారు. మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌కుమార్ రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రత్నశేఖర్‌రెడ్డి, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ సతీష్‌రెడ్డి, సర్పంచ్‌లు తస్లీమారియాజ్, గంగయ్య, ఎస్టీడి హరి, ఎంఐ హనీఫ్, రిజ్వాన్, ఖాదర్‌వల్లి, విశ్వనాథ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాల తనిఖీ



మధ్యాహ్నం భోజనాన్ని తనిఖీ చేస్తున్న డీవైఈఓ శ్రీరాం పురుషోత్తం

నిమ్మనపల్లె : మండలంలోని నిమ్మనపల్లి జడ్పీ హైస్కూల్, ఉర్దూ పాఠశాలల్లో జరుగుతున్న పదో తరగతి పరీక్షలను మదనపల్లి డీవైఈఓ శ్రీరామ్ పురుషోత్తం బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పటిష్టంగా నిర్వహించామన్నారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలను ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. బుధవారం జరిగిన సోషియల్ పరీక్షకు రెండు కేంద్రాలలో 344 మంది విద్యార్థులకు గాను 317 మంది విద్యార్థులు హాజరు కాగా, 27 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. ఒకేషనల్ పరీక్షలు మినహా పదో తరగతి పరీక్షలు ముగిసాయని తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనాన్ని తనిఖీ చేసి నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు మధ్యాహ్నం భోజనం, యూనిఫామ్ బట్టలు, పుస్తకాలను ఉచితంగా అందిస్తూ విద్యా ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎంఆర్ పద్మావతి, పరీక్షల ముఖ్య నిర్వహణ అధికారులు రెడ్డప్ప రెడ్డి,శ్రీనివాసులు, డిపార్ట్ అధికారులు బావజాన్, తదితరులు పాల్గొన్నారు.

కురబలకోట జాతరకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ : కురబలకోట దండు మారెమ్మ జాతరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం తొమ్మిది బస్సులు, ఆదివారం 25 ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. సాధారణ చార్జీలతో జాతర స్పెషల్ నడుస్తాయన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మద్యం పట్టివేత

బి.కొత్తకోట : కర్ణాటక మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తుండగా దాడులు నిర్వహించి నిందితున్ని పట్టుకున్నామని పోలీసులు బుధవారం తెలిపారు. స్థానిక బీసీకాలనీకి చెందిన అలీసాబ్ (55) కర్ణాటక మద్యం తీసుకొచ్చి విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకుని దాడులు నిర్వహించి 1.08 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని నిందితున్ని అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

మారెమ్మకు ప్రత్యేక పూజలు



మారెమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్

మదనపల్లె : మండలంలోని కోటవారిపల్లె తండాలో జరుగుతున్న జాతరలో బుధవారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి గ్రామస్తుల ఆహ్వానం మేరకు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తండా వారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం తండాలోని మారెమ్మ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ.. మంచిచేసిన ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కోటవారిపల్లె తండాలోని ప్రజాసమస్యలను పరిష్కరించి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలో ప్రతికుటుంబానికి లబ్ధి

కలకడ : జగనన్న ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి లబ్ధి, సంక్షేమం అందుతోంది. సంక్షేమ పథకాల సారథి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని తిరిగి ఆశీర్వదించాలని వాల్మీకిపురం మాజీ జెడ్పీటీసీ సభ్యులు చింతల శివానందరెడ్డి కోరారు. బుధవారం మండలంలోని కదిరాయ చెర్వు పంచాయతీ చెరువుముందరపల్లె, కదిరాయ చెర్వు తదితర గ్రామాలలో ఇంటింటికి వెళ్ళి ఫ్యాన్ గుర్తుకే ఓటువేసి మరొక్కమారు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు వెంకట్రమణరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌నాయుడు, మాజీ సర్పంచ్ కుమార్‌నాయుడు, సచివాలయ కన్వీనర్ మోహన్‌రాజ్, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి కుమార్‌రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులు జివి కిషోర్, పుల్లయ్య, బాబురెడ్డి, అంజన్‌కుమార్, చలమయ్యగౌడ్, చిరంజీవియాదవ్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఇన్‌చార్జ్ ఈఈగా శ్రీనివాసమూర్తి



ఈఈ శ్రీనివాసమూర్తికి అభినందనలు తెలుపుతున్న అసోసియేషన్ నాయకులు

మదనపల్లె : ఏపీఎస్పీడీసీఎల్ మదనపల్లె డివిజన్ ఇన్‌చార్జ్ ఈఈగా పుంగనూరు ఈఈ శ్రీనివాసమూర్తి బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక ఈఈ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మదనపల్లె డివిజన్ ఎలక్ట్రిసిటీ ఓ.సీ. ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి శేషాద్రినాగరాజు, సర్కిల్ నాయకులు రఘు, డివిజన్ నాయకులు జె.శ్రీనివాసులు సభ్యులతో కలిసి ఈఈకి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. సంస్థ అభివృద్ధికి తమ అసోసియేషన్ ఎప్పుడూ ముందుంటుందని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అభినందనలు తెలిపిన వారిలో శివమూర్తి, రాజు, సాయిప్రతాప్, వేమారెడ్డి, గోపాల్‌రెడ్డి, మురళి, ఆనందరెడ్డి, యుగంధర్, శ్రీపతి శాస్త్రి, కలాంబాషా, జగదీష్ రెడ్డి, యాకూబ్ అలీ, అర్జున, అస్లాంసాహెబ్, జనార్దనరెడ్డి తదితరులు ఉన్నారు.

తాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

పెద్దమండ్యం: వేసవిలో తాగునీటి సమస్యను ఎదుర్కోవడానికి ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సి వెంకటరమణయ్య అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. వేసవిలో తాగునీటి సమస్యను ఎదుర్కోవడానికి పల్లెల్లో ప్రజలకు తాగునీటిని పొదుపుగా వాడుకోవడంపై అవగాహన కల్పించాలన్నారు. త్రీఫెజ్ సరఫరా ఉన్నంత సేపు తాగునీటి పథకాలను వదలకుండా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. రోజులో నాలుగు గంటల పాటు తాగునీటి బోరును వదిలేలా చూడాలని సూచించారు. భూగర్భజలాలు అడుగంటి పోతున్నందున ప్రజలు సహకరించాలన్నారు. తాగునీటిని వృథా చేస్తే ఇబ్బందులు ఎదుర్కోక తప్పదన్నారు. పల్లెల్లో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు సమన్వయం చేసుకుని తాగునీటి వృథా కాకుండా ప్రజలకు పొదుపుగా వాడుకోవడంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరిరపసాద్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ బాలాజీరాజు

నిమ్మనపల్లె : వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా నివారణ చర్యలు చేపట్టాలని ఎంపీపీ నరసింహులు, ఎంపీడీఓ షాలేట్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ నరసింహులు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు ఆలస్యంగా రాగా, హాజరు రిజిస్టర్లో కోరం కోసం అవసరమైన ఐదుగురు సభ్యులు సంతకాలు చేశారు. తహసీల్దార్ బాలాజీ రాజు, ఎంపీడీఓ షాలేట్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున, అజెండా చర్చ లేదని, అత్యవసర పనులకు సంబంధించి మాత్రమే చర్చ జరగాలన్నారు. ఇంతలో సామకోట వారి పల్లె సర్పంచ్ మహాదేవ రెడ్డి, రాచవేటివారిపల్లె సర్పంచ్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా మండల పరిషత్ నుంచి పంచాయతీలకు ఏ మేరకు నిధులు ఇచ్చారో వివరాలు చెప్పాలని నిలదీశారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు బోర్లు, మోటర్లు, పైప్ లైన్, మరమ్మత్తులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ రెడ్డిశేఖర్ రెడ్డి, ఆర్‌బికె చైర్మన్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, గారబురుజు రమణారెడ్డి, సర్పంచ్ వరలక్ష్మి, రెడ్డప్ప,హార్టికల్చర్ అధికారి ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి, ఈఓపీఆర్డి చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటేయండి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ గంగులమ్మ, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి

వాల్మీకిపురం : గత ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలు వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని సర్పంచ్ గంగులమ్మ, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని గంగమ్మగుడివీధి, ఐఏవై కాలనీ ప్రాంతాల్లో ఇంటింటికి పర్యటించి, కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తనయుడు చింతల సాయిక్రిష్ణారెడ్డి మండలంలోని ఓబులంపల్లిలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సీఎం జగన్మోహన్ రెడ్డి పేదలు, మహిళలు, రైతులు ఇలా అన్ని వర్గాల ప్రజలకూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు కావాలంటే జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శంకర, సుధాకర, గణేష్, చంద్రాచారి, ఆంజి, ముబారక్, రమేష్, మధు, పులిబ్రదర్స్, ఖాదరి తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి



తలపులలో కేంద్రబలగాలు, పోలీస్ అధికారుల కవాతు

పీలేరురూరల్ : త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో ప్రజలందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని యర్రగుంటపల్లె, దొడ్డిపల్లె, అగ్రహారం, ఇందిరమ్మ కాలనీ గ్రామాల్లో కేంద్ర సాయుధ బలకాలు, పోలీస్ సిబ్బందిచే కవాతు చేపట్టారు. అనంతరం గ్రామాల్లో ప్రజలకు శాంతి భద్రతలపై అవగాహన కల్పించార. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగ కుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరసింహుడు, ఏఎస్ఐ హేమసుందరం, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE. MADANAPALLE

I.P.7/2024

Petitioner :

Voorumundara Venkatramana,
S/o Venkatrayappa,Deganapalle,
H/o B.Kothakota,
Annamayya Dist.

Respondent :

B.Venugopal Reddy,
S/o Konda Reddy, D.no.3-145-8,
Prasanth Nagar, Madanapalle Town, Annamayya Dist.

మదనపల్లి అదనపు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు నందు వూరుముందర వెంకట్రమణ అను నతడు పైన తెలిపిన ప్రతివాది పైన ఇన్సాల్వెన్సి పిటీషన్ నెం. 7/2024గా దాఖలు చేయబడి 01.04.2024 నాటికి వాయిదా వున్నది. కావున పైన తెలపిన ప్రతివాది మరియు యావన్మంది ప్రజానీకం గమనించగలరు.

// BY ORDER OF THE COURT //
Y.SAMBA SIVA REDDY, B.A., B.L.,
Advocate, Madanapalle.

మతోన్మాద బీజేపీని ఓడించండి



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు నరసింహులు

ములకలచెరువు : రాజ్యాంగ హక్కులను మంటగలుపుతున్న మతోన్మాద బీజేపీని ఓడించి దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు, పౌరులందరిపైన ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్. నరసింహులు పిలుపునిచ్చారు. బుధవారం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టి పదేళ్ల సమయం గడుస్తున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలన్నారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, ఆ పార్టీకి మద్దతు ఇస్తున్న పార్టీలను బుద్ధి చెప్పాలని సూచించారు. సమావేశంలో నియోజకవర్గ కార్యదర్శి ఎస్.మనోహర్‌రెడ్డి, నాయకులు అంజనప్ప, నరసింహులు, భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఎమ్మార్సీని తనిఖీ చేసిన ఆర్జేడీ

బి.కొత్తకోట : బి.కొత్తకోట ఎమ్మార్సీని బుధవారం విద్యాశాఖ కడప ఆర్‌జేడీ రాఘవరెడ్డి తనిఖీ చేశారు. 3, 4, 5 తరగతుల విద్యార్థుల నోట్, వర్క్ బుక్‌లను పరిశీలించారు. టీచింగ్ టూల్ లెర్నింగ్, డిజిటల్ విద్యకు సంబంధించి వివరాలను ఎంఈఓ భీమేశ్వరాచారీని అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులకు జరిగిన ప్రమాదాన్ని తెలుసుకుని విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

పదిమంది బైండోవర్

బి.కొత్తకోట : పాత కేసుల్లో నిందితులుగా ఉన్న పదిమందిని బైండోవర్ చేసినట్టు పోలీసులు బుధవారం తెలిపారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా వీరిని బైండోవర్ చేశామని తెలిపారు. ఎన్నికల్లో ఎలాంటి గొడవలు జరగకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

నేడు కొండామారిపల్లెలో ఎన్నికల ప్రచారం

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం కొండామారిపల్లె పంచాయతీ బోడుమల్లదిన్నెలో గురువారం వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి నిసార్‌అహ్మద్ తెలిపారు. ఉదయం 6.30 గంటలకు ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తామన్నారు. సాయంత్రం 4 గంటలకు రామాచార్లపల్లె పంచాయతీ గంగమ్మగుడి నుంచి ఎన్నికల ప్రచారం సాగిస్తామన్నారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి,మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్‌రెడ్డి హాజరు కానున్నారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.